ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబర్ 2023



ప్రతి ఇంటా సంతోషం నిండాలి

విజయనగరం : ఈ క్రిస్మస్... ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని, ప్రతి ఇంటా ఆనందపు కాంతులు వెదజల్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సాటి మానవుల పట్ల ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం చూపడం అనే ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరనీయమని పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినం అందరిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు.



వంగర మండలం కింజంగి గ్రామంలో విద్యుత్తు కాంతులతో ముస్తాబైన చర్చి

ఇరిగేషన్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు భయపడుతున్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఐదు ఇరిగేషన్ ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిస్తే రెండింటికి టెండర్లు వేయడమే అందుకు నిదర్శనం. మూడు ప్యాకేజీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఖరారైన టెండర్లలో పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

బాబోయ్.. ఇరిగేషన్ పనులు

- చెరువుల అభివృద్ధికి రూ.9.26 కోట్లు మంజూరు
- ఐదు ప్యాకేజి పనులకు రెండింటికి మాత్రమే టెండర్లు
- మూడు పనులకు ముందుకురాని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చెరువులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ప్యాకేజీల కింద 20 చెరువుల అభివృద్ధికి రూ.9.26 కోట్లు కేటాయించింది. మొదటి ప్యాకేజీలో బాడంగి, సాలూరు, తెర్లాం మండలాల్లో ఐదు చెరువుల అభివృద్ధికి రూ.2.37 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. పనుల కోసం మూడు సార్లు టెండర్లు పిలిచింది. ఒకసారి కూడా టెండర్ పడలేదు. రెండో ప్యాకేజీలో మక్కువ మండలంలో 2, గరుగుబిల్లి మండలంలో రెండు చెరువులకు రూ.1.87 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చి, పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. మూడో ప్యాకేజిలో పార్వతీపురం మండలంలో మూడు చెరువులకు రూ.1.86 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు టెండరు వేసి ఒప్పందం జరిగినప్పటికీ పనులు కావడం లేదు. నాలుగో ప్యాకేజీలో బలిజిపేట మండలంలోని నాలుగు చెరువులకు రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. మూడు సార్లు టెండర్లు పిలిచినా ఒకసారి కూడా టెండరు పడలేదు. ఐదో ప్యాకేజీలో బాడంగి మండలంలో ఒకటి, గరుగుబిల్లి మండలంలో ఒకటి, బలిజిపేట మండలంలో రెండు చెరువులకు రూ.1.06 కోట్లు మంజూరయ్యాయి. రెండు సార్లు టెండర్లు పిలవగా ఒక్కసారి కూడా టెండరు దాఖలు కాలేదు. దీన్నిబట్టి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచ బ్యాంకు నిధులకూ..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రపంచ బ్యాంకు నిధులు ఆరు చెరువుల అభివృద్ధికి రూ.6.61 కోట్లు మంజూరయ్యాయి. చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతం, ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతంతో ఆరు చెరువులకు రూ.6.61కోట్లు మంజూరయ్యాయి. ఆరు చెరువులకు టెండర్లు పూర్తి అయినప్పటికీ మూడు చెరువుల పనులు ప్రారంభమే కాలేదు. మూడు చెరువుల పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి. బాడంగి మండలంలోని బొమ్మినాయుని చెరువుకు రూ.1.1 కోట్లు, సీతానగరం మండలంలోని తుంబా చెరువుకు రూ.42 లక్షలు, బలిజిపేట మండలంలోని గొల్లంపి చెరువుకు రూ.1.93కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. తెర్లాం మండలంలోని రాణి చెరువుకు రూ.85 లక్షలు మంజూరు కాగా రూ.18 లక్షల పనులు మాత్రమే పూర్తి చేశారు. మెరకముడిదాం మండలంలోని కోమటి చెరువుకు రూ.82 లక్షలు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.21 లక్షల పనులు, సదాశివుని చెరువుకు రూ.2.1 కోట్లు మంజూరు కాగా రూ.41.4 లక్షల పనులు మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు సకాలంలో అవ్వకపోవడం వల్లే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులకు అందని సాగునీరు

చెరువుల అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. సాగునీరు అందకపోవడంతో పంటలు సక్రమంగా పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరువులను అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

చెరువుల అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కొన్ని చెరువులకు పూర్తిగా టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరికొన్ని చెరువులలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చినా, వేగవంతంగా చేయడం లేదు. అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

\- వైవి రాజేశ్వరి, ఇరిగేషన్ ఎస్ఇ

అందరి చూపు బొబ్బిలి వైపు

- వైసిపి అభ్యర్థి మార్పు అనివార్యం?
- కొత్త ముఖం ఎవరో?
- అన్వేషణలో అధికార పార్టీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గర పడుతుండడం, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో అందరి చూపు బొబ్బిలి రాజకీయాల వైపు తిరుగుతున్నాయి. ఇంతకీ వైసిపి తరపు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు? స్థానిక ఎమ్మెల్యే మార్పు అనివార్యమేనా? అలా అయితే కొత్త ముఖం ఎవరు? ఇదీ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సాగుతున్న చర్చ. వైసిపిలో చాలా వరకు స్థానిక ఎమ్మెల్యేలను మార్చాలని, వారి సేవలు పార్టీలో అనివార్యమనుకుంటే మరో అసెంబ్లీ స్థానానికి బదిలీ చేయడం వంటి చర్యలు ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో బొబ్బిలి, రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యేలను తప్పిస్తారని, మరో ఇద్దరు ఎమ్మెల్యేలను బదిలీ చేస్తారనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో బొబ్బిలిలో వైసిపి తరపున ఎవరు పోటీచేస్తారో? అన్న చర్చ గట్టిగా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా అంతటా వైసిపి గాలికి టిడిపి కొట్టుకుపోయినప్పటికీ బొబ్బిలి నియోజకవర్గంలో మాత్రం గట్టిపోటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తరువాత కూడా టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన కేడర్‌ను అంటిపెట్టుకుని ముందుకు సాగుతున్నారు. మరోవైపు పార్టీని నడపడంలోనూ, ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై స్పందించడంలోనూ స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విఫలమయ్యారు. దీనికితోడు బొబ్బిలిలో ఒక్కగానొక్క జ్యూట్ మిల్లును తెరిపిస్తానన్న ఆయన చివరకు దాన్ని రియల్ ఎస్టేట్‌కు విక్రయించేందుకు సహాయపడ్డారు. స్థానిక గ్రోత్ సెంటర్‌కు గ్రోత్ లేకుండా పోయింది. అటు టిడిపిలో బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపే అవకాశం ఉండడం, ఇటు ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తుండడంతో శంబంగిని మారుస్తారని చర్చ నడుస్తోంది. ఒకవేళ ఆయన్ను మారిస్తే ఆ స్థానంలో ఎవరు వస్తారనే చర్చ కూడా సాగుతోంది. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో బొబ్బిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు ప్రచారం నడుస్తోంది. మంత్రి బొత్స, సోదరులను వారి స్థానాల నుంచి తప్పించే పరిస్థితి లేదు. నెల్లిమర్లలో ఆయన సమీప బంధువు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

రాజాంలో రిజర్వేషన్ అనుకూలించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మజ్జి శ్రీనివాసరావు బొబ్బిలిలో పోటీ చేస్తారని చర్చ నడుస్తున్నప్పటికీ టిడిపి అభ్యర్థిని ఎదుర్కోవాలంటే ఆ నియోజకవర్గంలోని మెజార్టీ సామాజికవర్గం నుంచే ఉండాలని వైసిపి అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. లేదంటే ఆ సామాజికవర్గం ప్రభావం జిల్లా అంతటా చూపించే ప్రమాదం లేకపోలేదని పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది వైద్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని, వారు అంతగా ఆసక్తి చూపడం లేదని కూడా చర్చ నడుస్తోంది. ఈ అవకాశం ఎవరికి దక్కుతుందో కొద్దిరోజులు వేచిచూడాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గజపతినగరంలో సెల్‌ఫోన్లకు పూజలు చేస్తున్న అంగన్వాడీలు

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగిస్తుంటే, మరోవైపు ప్రభుత్వం రెచ్చగొట్టే ప్రకటనలు చేయడంపై వారంతా భగ్గుమన్నారు. అంగన్వాడీలకు సెల్‌ఫోన్లు, చీరలకు కోట్లాది రూపాయలు ఖర్చవుతోందంటూ పాలకులు చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన సెల్‌ఫోన్లు, చీరలకు పూజలు చేసి, నిరసన తెలిపారు. నాసిరకం సెల్‌ఫోన్లు, చీరల పంపిణీ.. కాంట్రాక్టరును పెంచుకోవడానికి చేసింది తప్ప అంగన్వాడీల పట్ల చిత్తశుద్ధి కాదని గళమెత్తారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే క్రిస్మస్ తర్వాత పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో అంగన్వాడీల నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజు కొనసాగింది.

మీరిచ్చిన చీరలకో దండం ఫోన్లకో నమస్కారం

- ప్రభుత్వమిచ్చిన సెల్‌ఫోన్లు, చీరలకు పూజలు
- వినూత్న రీతిలో అంగన్వాడీల నిరసనలు
- పాలకుల ప్రకటనపై ఆగ్రహం
- 13వ రోజుకు నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. విజయనగరం కలెక్టరేట్ వద్ద రోడ్డుపై ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు, చీరలకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన పూజలు చేసి, నిరసన తెలియజేశారు. వీటి కోసమేనా కోట్లు ఖర్చు పెట్టారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫోన్లు పని చేయవని, చీరలు చాలా నాసిరకంగా ఉన్నాయని ఆవేదన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వమిచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నామని చెప్పారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే అదనంగా జీతం ఇవ్వాలని అడిగితే చీరలకు, సెల్‌ఫోన్లకు పెట్టిన ఖర్చును మంత్రులు చెబుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు, పెన్షన్, గ్రాడ్యుటీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వి.పైడిరాజు, జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : రాజాంలో నిరవధిక సమ్మె శిబిరంలో భాగంగా అంగన్వాడీలు సెల్‌ఫోన్లకు, చీరలకు పూజలు చేస్తూ నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.ఉమాకుమారి, సునీత, భారతి, జయలక్ష్మి, పుణ్యవతి, చిన్నమ్ముడు, పద్మావతి, పార్వతి, వనజ, లక్ష్మీనారాయణ, ఈశ్వరమ్మ, కాశీరత్నం, సత్యవతి పాల్గొన్నారు.

గజపతినగరం : అంగన్వాడీల సమ్మెలో భాగంగా గజపతినగరంలో ప్రభుత్వం అందజేసిన సెల్‌ఫోన్లకు, చీరలకు పూజలు చేశారు. సెల్‌ఫోన్లకు కొబ్బరికాయ కొట్టి, ప్రదక్షిణలు చేసి, పూజా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుభాషిణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాణి, నాగమణి, పద్మ, సన్యాసమ్మ, అనురాధ పార్వతి, సిఐటియు నాయకులు కాంతారావు, రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

జామి : సమ్మెలో భాగంగా జామి మండల కేంద్రంలో అంగన్వాడీలు కొవ్వొత్తులు ర్యాలీ చేపట్టి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, విష్ణుఅమ్మ, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, దేవుడమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలో ఆదివారం సాయంత్రం అంగన్వాడీలు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, ఎఐటియుసి నాయకులు బి.మాణిక్యం, పి.సుశీల, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి.. అంగన్వాడీలకు మద్దతుగా కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న చిన్నారులు

అంగన్వాడీలకు మద్దతుగా చిన్నారులు

బొబ్బిలి : అంగన్వాడీలకు మేము సైతం అండగా ఉంటామని చిన్నారులు ముందుకొచ్చారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా మున్సిపాలిటీలోని సింగారపువీధిలో చిన్నారులు కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని చిన్నారులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

విజయనగరం, రాజాంలో సెల్‌ఫోన్లకు, చీరలకు పూజలు చేస్తూ దండం పెడుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

జామిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు

శృంగవరపుకోటలో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

రేపటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి చేపట్టే మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన రావు, బి.రమణ కోరారు. నగరంలో స్టేడియంపేటలో ఆదివారం సాయంత్రం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సిలో ఒక్కొక్క కార్మికునికి రూ.8 వేలు వేతనం పెరగాల్సి ఉండగా, రూ.3 వేలు పెంచి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులపై పర్యవేక్షణ, పనిభారం పెరిగాయి తప్ప సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఏళ్ల తరబడి రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వటం లేదన్నారు. ఆప్కోస్ కారణంగా 60 ఏళ్లు నిండిన వారిని ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే ఇంటికి పంపిస్తున్నారని, వారి పరిస్థితి దయనీయంగా ఉందని వాపోయారు. కరోనాలో సైతం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన మున్సిపల్ కార్మికులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరవధిక సమ్మెకు సిద్ధం కావాల్సి వచ్చిందని తెలిపారు. ప్రజలంతా సహకరించి సమ్మెను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో కుమారి, రమ, ఈశ్వరమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జోన్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని ఎన్ఎంయుఎ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా పరిషత్తు మినిస్ట్రీయల్ భవనంలో నిర్వహించిన జోనల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలలుగా పోరాటం చేస్తున్నా స్థానిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్పందన సరిగ్గా లేకపోవడం వల్ల జోన్ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్ఎంయు నాయకులపై వేధింపులు విడనాడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయుఎ రాష్ట్ర కోశాధికారి పివి మోహన్, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రదీప్‌కుమార్, ఎం.వి.ఆర్ మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు. పిజి రాఫెల్, బిఎస్ రాములు, నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయనగరం టౌన్ : కంటి సమస్యల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్వామి ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు ఎం.రవళి తెలిపారు. ఆదివారం నగరంలోని పూల్‌బాగ్‌లో ఉన్న సరస్వతి శిశు మందిర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో 176 మందికి ఆమె కంటి పరీక్షలు చేశారు. అందులో 38 మందిని కేటరాక్ట శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు ఆస్పత్రి పిఆర్ఒ బాబ్జీ తెలిపారు. దవళ సర్వేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన శిబిరంలో విజయభావన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, సరస్వతి శిశు మందిర్ ప్రధానాచార్యులు రామారావు, పూర్వ ప్రధానాచార్యులు కమల, రాజారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి కొండబాబు

ప్రజాశక్తి-గంట్యాడ

మండల కేంద్రం గంట్యాడకు చెందిన మాజీ ఎంపి కొండపల్లి పైడితల్లినాయుడు కుమారుడు కొండపల్లి కొండబాబు, మనుమడు శ్రీనివాస్ టిడిపిలో చేరారు. ఆదివారం ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఆధ్వర్యాన ఆ పార్టీలో చేరారు. వీరు గతంలో వైసిపిలో పనిచేసి, ఇటీవల రాజీనామా చేశారు. కొండబాబు టిడిపి తరపున గతంలో ఎంపిపిగా పనిచేశారు. విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన శ్రీనివాస్.. ఆరేళ్ల క్రితం నుంచి నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, భార్య మంగళపాలెం సర్పంచి సత్యవతి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పాశిల క్రిష్ణ, పతివాడ అప్పలనాయుడు, తదితరులు టిడిపిలో చేరారు.

కొండపల్లి శ్రీనివాస్‌కు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కొండబాబు చేరికతో పలువురు రాజీనామా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కొండపల్లి కొండబాబును టిడిపిలో చేర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు రాజీనామా చేశారు. కొండపల్లి కొండబాబు, కొండబాబు కుమారుడు శ్రీనివాస్ ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. దీన్ని వ్యతిరేకిస్తూ తెలుగు యువత గజపతినగరం నియోజకవర్గ అధ్యక్షులు పెద్దరెడ్ల సత్యనారాయణ, తెలుగు మహిళ గంట్యాడ మండల అధ్యక్షులు, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్‌పర్సన్ గుల్లిపల్లి లలిత, టిడిపి మండల ఉపాధ్యక్షులు గొర్రిపాటి శ్రీనివాసరావు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీకి వేర్వేరుగా పంపిన రాజీనామా లేఖలను విడుదల చేశారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు మాత్రమే నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడ్డారని తెలిపారు. అటువంటి సమయంలో కూడా కొండబాబు, ఆయన కుమారుడు ప్రత్యర్థులైన బొత్స సోదరులతో చేతులు కలిపి పార్టీని దెబ్బతీశారని పేర్కొన్నారు. దీంతో అధికారంలోకి వచ్చిన మంత్రి బొత్స, ఆయన సోదరుడు అప్పలనర్సయ్యతో తాము ఎన్నో వేధింపులు, అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. బొత్స కుటుంబానికి ఏజెంటులా వ్యవహరించిన వారిని పార్టీలో చేర్చుకోవడమంటే.., వెన్నుపోటు రాజకీయాలకు మరింత అవకాశం ఇచ్చినట్టే భావిస్తున్నామని, ఇటువంటి వ్యవహారం తమను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని వెల్లడించారు. కె.ఎ.నాయుడు నాయకత్వాన్ని తప్ప కొండబాబు, ఆయన కుమారుడు నాయకత్వాన్ని నియోజకవర్గం, ముఖ్యంగా గంట్యాడ మండల వాసులు విశ్వసించడం లేదని పేర్కొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీనివాసరావు

మండలంలోని జరజాపుపేటలోని మెగా హౌస్ కంప్లీషన్ కార్యక్రమంలో భాగంగా జగనన్న గృహ నిర్మాణం పై హౌసింగ్ అధికార్లు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా హౌసింగ్ అధికారి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న గృహ లబ్దిదార్లు పునాది, గోడల స్థాయిలో నిర్మాణాలు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎంత త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేస్తారో వారికి వెంటనే బిల్లులు చెల్లింపు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, హౌసింగ్ ఎఇ ఆర్. పవన్ పాల్గొన్నారు.

మిమ్స్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కేలండర్ ఆవిష్కరిస్తున్న బాబీ

మిమ్స్ నూతన సంవత్సరం కేలెండర్‌ను ఆదివారం శ్రీరామ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు (బాబీ) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగి, మిమ్స్ మరింత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

భోగాపురం పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆదేశాల మేరకు ఆదివారం నుంచి అప్ గ్రేడ్ చేశారు. ఇప్పటి వరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్ఐ ఉండగా ఇక నుంచి సిఐ ఉంటారు. ఈ స్టేషన్‌కు కొత్త సిఐను ఇంకా నియమించాల్సి ఉంది. ప్రస్తుతం సిఐగా ఉన్న బి.వి వెంకటేశ్వరరావు మిగతా మూడు మండలాలైన నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు సర్కిల్ సిఐగా వ్యవహరిస్తారు. ఈ మూడు మండలాలు కలిపి ఒక కొత్త సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ప్రస్తుతం అప్ గ్రేడ్ చేసిన భోగాపురం పోలీస్ స్టేషన్‌కు ప్రస్తుత సిఐ బి.వి. వెంకటేశ్వరరావు ఇన్చార్జిగా వ్యవహరించనున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - డెంకాడ

చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

మండలంలోని గొలగాం గ్రామానికి చెందిన బూర్ల రేణుక రుమటైడ్ ఆర్థరైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని సిఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదలైన రూ.1.40లక్షలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం తన నివాసంలో అందించారు. ఈ కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ బూర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కోల్‌కత్తా ఇటీవల జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొన్న నియోజకవర్గ క్రీడాకారులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. పార్వతీపురం ప్రాంతానికి చెందిన బూరి గణేష్ 21-22 కేజీల విభాగంలో బంగారు పతకం, 45-48, 63-65 కేజీల విభాగాల్లో తెంటు హేమంత్ రజత పతకాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆ క్రీడాకారులకు శిక్షణ అందజేసిన మండల శరత్, కె.విమల్ రాజ్, స్టేట్ జనరల్ సెక్రెటరీ బి అనిల్ కుమార్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంతగానో సహాయ సహకారాలు అందచేసి, ప్రోత్సహించిన స్థానిక ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ తన వంతు ప్రోత్సాహం, సహాయ సహకారాలు అన్ని వేళలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సువ్వాడ లావణ్య, సచివాలయం కన్వీనర్ ఎస్.చంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఉన్న గోతులను తక్షణమే కప్పాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారి పక్కన పెద్దపెద్ద గోతులు కప్పకుండా వదిలేసిన బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ కాంట్రాక్ట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ కోసం తవ్విన ఎనిమిది అడుగుల గొయ్యిను సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తహాశీల్దార్ కార్యాలయం నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు 8 పెద్ద పెద్ద గొయ్యిలు నెట్వర్క్ వైరు కోసం తవ్వి నెలరోజులైనా ఆ వాటిని కప్పకపోవడంతో అటుగా ఉన్న తహాశీల్దార్, పోలీస్ స్టేషన్‌కు, ఎంపిడిఒ, వెలుగు కార్యాలయాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం రాకపోకలు ప్రజలు గొయ్యిలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గోతులు కప్పి అటు వాహన దారులను, ఇటు ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గౌరునాయుడు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో జయకృష్ణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం తుడి గ్రామంలోని కానుకలు మాత ఆలయంలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, కంబర ఎంపిటిసి పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, టిఎన్‌టియుసి నాయకులు ఎన్.శశికుమార్, మాజీ సర్పంచి గొర్రెల గౌరునాయుడు, అలజంగి కృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి జాడ శ్రీధర్, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 26నుంచి చేపట్టనున్న సమ్మెకు మద్దతు తెలపాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకర్ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారి మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెకు వెళ్లడానికి ప్రభుత్వ మొండి వైఖరే కారణమని చెప్పారు. ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు ,చంటి పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేట వైసిపి నాయకులు తెంటు శివఅప్పలనాయుడు తల్లి తెంటు రాములమ్మ జ్ఞాపకార్థంగా పేద మహిళలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ తెంటు రాములమ్మ జ్ఞాపకార్థంగా పేదలకు చీరలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, రెడ్డి దామోదర్, తెంటు శివఅప్పలనాయుడు, కౌన్సిలర్ తెంటు పార్వతమ్మ, తెంటు రవి, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ గిరి కోసం ఎదురుచూపులు

ఇంకా తేల్చని ట్రస్టు బోర్డు

నేడు శంబరలోకి పెద్ద పోలమాంబ ప్రవేశం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించిన శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ట్రస్ట్ బోర్డు చైర్మన్ గిరి కోసం వైసిపిలోని రెండు గ్రూపులు ఎదురుచూస్తున్నాయి. జాతర సమీపిస్తున్నప్పటికీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారులు, రాజకీయ నాయకులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. ఈనెల 14తోనే పాత ట్రస్టు బోర్డు రెండేళ్ల గడువు ముగిసింది. జనవరి 22, 23, 24 తేదీల నుంచి మార్చి వరకు 10 వారాల పాటు ఈ జాతర జరగనుంది. ఇప్పటికే జాతరకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కేంద్రంలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనూ ట్రస్టు బోర్డు అంశం ప్రస్తావనకు రానట్టు తెలిసింది. ఇప్పటికే శంబరలోని వైసిపిలో రెండు గ్రూపులు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కోసం ఎదురుచూస్తూ చైర్మన్ గిరి కోసం ఎవరి ప్రయత్నాలు వారు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు ఒక గ్రూపునకు చెందిన పూడి దాలి నాయుడు ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా రెండేళ్లు కొనసాగారు. ఈసారి ట్రస్టు బోర్డు ఏర్పాటైతే చైర్మన్ పదవి కోసం తీళ్ల తిరుపతిరావు గ్రూపు ఆశగా ఎదురు చూస్తోంది. గతంలో వయసు రీత్యా మండలంలోని వైసిపి నాయకత్వం పూడి దాలినాయుడుకు ఈ అవకాశం కల్పించింది. అయితే ఈసారి తమ గ్రూపునకు చైర్మన్ పదవి ఇవ్వాలని తిరుపతిరావు వర్గం గట్టిగా ప్రయత్నాలు కొనసాగిస్తుంది. ఇదిలా ఉండగా శంబరలో ఉన్న రెండు గ్రూపులను వైసిపి నాయకత్వం ఎవరిని కాదనలేక చెరోచేత్తో నడిపిస్తూ వస్తుంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి రెండు గ్రూపులుగా ఏర్పడింది. అప్పట్లో సర్పంచ్ ఎన్నికల్లో కలిసి పని చేసినా, ఎంపిటిసి ఎన్నికల సమయంలో చీలిక ఏర్పడింది. తిరుపతిరావు గ్రూపులోని గంజి అప్పలనాయుడుకు ఎంపిటిసి టికెట్ ఇవ్వాలని పట్టు పట్టినప్పటికీ చివరి నిమిషంలో అధిష్టానం దాలినాయుడు తమ్ముడు లక్ష్మణరావుకు సీటు ఇవ్వడంతో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో తిరుపతిరావు గ్రూపు బాహాటంగానే టిడిపి అభ్యర్థి పోలినాయుడు గెలుపునకు సహకరించింది. దీంతో అప్పటి నుంచి విభేదాలు అలాగే ఉన్నాయి. ఏది ఏమైనా ఈసారి ట్రస్ట్ బోర్డు ఏర్పాటైతే తిరుపతిరావు గ్రూపునకే చైర్మన్ అవకాశం దక్కుతుందేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు అంశం తేలకపోవడంతో ఆశావాహులకు అంతర్ మదనం తప్పడం లేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏ విధమైన కమిటీలు లేకుండా దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జాతర జరిగే ఆస్కారం ఎక్కువగా కనిపిస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు.

నేడు శంబరలోకి పెదపోలమాంబ

జాతరలో తొలి ఘట్టమైన పెదపోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి సోమవారం తీసుకురానున్నారు. సోమవారం నుంచి జనవరి 3 వరకు పెద్ద పోలమాంబ భక్తుల పూజలు అందుకోనుంది. అనంతరం పోలమాంబ జాతరకు సన్నద్ధం మొదలవుతుంది. సోమవారం రాత్రి పోలమాంబ ఆలయ కార్యనిర్వహణ అధికారి వివిఎస్ నారాయణ ఆధ్వర్యంలో పెద్ద పోలమాంబను మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామంలోకి కొని తీసుకురానున్నారు.

శంబర పోలమాంబ వనం గుడి

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

దుప్పట్లు పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని గిరిజన గ్రామాలైన ముషిడిపల్లి, బందవలస, దొర్లపాలెం గ్రామంలో ఉన్న నిరుపేద గిరిజనులకు జిల్లాలోని అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ తెరెసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సంస్థ అధ్యక్షులు అండ్ ఫౌండర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ మూడు గ్రామాల సర్పంచ్‌లు, కనకం, సంస్థ సభ్యులు ఝాన్సీ, సాయి మనోజ్, కిరణ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షన్లు పథకంలో అక్రమాలకు పాల్పడుతున్న శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తే వ్యాపారులకు అమ్ముకుని గ్యాస్ యాజమాన్యం సొమ్ము చేసుకుంటుందని విమర్శించారు.

పల్లెపల్లెకు పార్టీ సిద్ధాంతాలు

జనసేన మండల అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి

ప్రజాశక్తి- డెంకాడ

జనసేన పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పల్లె పల్లెకు తీసుకువెళ్లి పార్టీని మండలంలో అభివృద్ధి చేయడానికి ఎనలేని కృషి చేస్తానని జనసేన పార్టీ మండల అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి తెలిపారు. ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు. మరిన్ని విషయాలు ఆమె మాటల్లోనే...

పతివాడ కృష్ణవేణి

మండలంలోని పినతాడివాడ మధుర గ్రామం ఒమ్మిపేటలో నేను నివాసం ఉంటున్నాను. మా గ్రామంలో అంగన్వాడి కార్యకర్తగా పనిచేశాను. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీలో చేరాను. ఈ మండలంలో ఎక్కువ శాతం మంది బీసీలుండటంతో బీసీ అయిన నన్ను పవన్ కళ్యాణ్ జనసేన మండల అధ్యక్షులుగా నియమించారు. దీంతో అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా పార్టీ బాధ్యతలు తీసుకొని మండలంలో అన్ని గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలుసుకుని వాటిపై పోరాటం చేస్తున్నాను. మండలంలో ఎక్కువగా తాగునీటి సమస్య ఉంది. పేడాడ పంచాయతీ తమ్మాపురం గ్రామంలో తాగునీటి సమస్య పై పోరాడి పరిష్కారానికి కృషి చేశాం. పినతాడివాడలో అంగన్‌వాడీ కార్యకర్త సమస్య కూడా పరిష్కరించాం. నాకు పలు స్వచ్ఛంద సంస్థల్లో వాలంటీర్‌గా పనిచేసే అనుభవం ఉంది. అందరితో కలిసి కట్టుగా పనిచేయడం ముదటి నుంచీ అలవాటే కావడంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, పార్టీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాను. బూత్ లెవల్లో పార్టీ అభివృద్ధి అయ్యేలా పని చేస్తున్నాం. మండలంలో ఉపాధి కోసం చిన్న చిన్న పరిశ్రమలు లేక యువత ఇబ్బందులు పడుతున్నారు. జనసేన అధికారంలోకి వస్తే పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాను. ఈ నియోజకవర్గంలో కంపెనీలున్నా అందులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి, జనసేన ఎవరికి టిక్కెట్ ఇచ్చినా శక్తి వంచన లేకుండా ఎమ్మెల్యేగా గెలిపించేందుకు పని చేస్తాం. మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో అసంతృప్తితో ఉన్న అధికార పార్టీ నాయకులను కలిసి జనసేన సిద్ధాంతాలను వివరించి పార్టీలోకి ఆహ్వానిస్తాం. మండలములో సుమారు 43 వేలకు పైగా ఓటర్లున్నారు. ఇందులో బీసీలే అధికంగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ బీసీలకు ప్రాధాన్యత ఇస్తారన్న నమ్మకంతో చాలా మంది ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దీన్ని అందిపుచ్చుకోవడానికి రానున్న ఎన్నికల్లో మరింత ప్రచారం చేసి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయించే విధంగా ప్రజలను చైతన్య పరుస్తాం. నియోజకవర్గంలో పార్టీ విజయానికి కృషి చేస్తామని జనసేన మండల అధ్యక్షులు కృష్ణవేణి తెలిపారు.

కళ్లాలుగా మారిన రహదారులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు కల్లాలుగా మారాయి. చాలా మంది రైతులు తమ పొలాలు నుంచి తెచ్చిన వరి పంటను రోడ్లపై వేసి నూర్పులు చేసుకుంటున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, సైకిల్ పై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదాలు కొని తెచ్చుకోవడమేనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా తెల్లవారు జామున దట్టమైన పొగ మంచు పడటంతో రోడ్డుపై వేసిన వరి చేనుపై మంచు కురిసి తడిసి పోతుంది. ఈ తడిపై నుంచి వాహనాలు ప్రయాణిస్తే స్లిప్ అయి బొల్తా పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వరి పంటను రోడ్డుపై వేసి నూర్పు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరి నూర్పు పనుల్లో రైతులు బిజీ బిజీ

మండలంలో పలు గ్రామాలలో వరి పంట నూర్పు పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. అందరూ ఒకేసారి వరి నూర్పు పనులు ప్రారంభించడంతో కూలీలు కూలి రేట్లు పెంచడంతో కొంత ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు.

రోడ్డుపై వేసిన వరి చేను

సొంత సొమ్ముతో ఉపకార వేతనాలు

ప్రజాశక్తి - భోగాపురం

విద్యలో ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్షిప్‌లను అందజేస్తున్నామని నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ లోకం మాధవి అన్నారు. భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో సుమారు రూ. 2.61లక్షల తమ సొంత నిధుల నుంచి ఆమె విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య అనేది ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చాలామంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అలాంటి వారి కోసం ఏటా స్కాలర్‌షిప్‌లను తమ వంతు సహాయంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. పూసపాటిరేగ జనసేన నాయకుడు కొలా శ్రీను ప్రమాదవశాత్తు తన కాళ్లు పోగొట్టుకున్న సందర్భంగా ఆయనకు ఇటీవల పార్టీ నుంచి మూడు లక్షల చెక్కు అందజేశారు. కాగా ఆదివారం ఆయనకు ఆర్టిఫిషియల్ కాలు పెట్టించుకునేందుకు ఆమె మరో రూ.15 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పళ్ళ రాంబాబు, పల్లంట్ల జగదీష్, పిడుగు జోగారావు, వడ్ల గిరిబాబు, వాసుపల్లి రాము, నీలాద్రి ఈశ్వరరావు, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌ను అందిస్తున్న లోకం మాధవి

అప్పన్నపేటలో జనసేన నాయకుల పర్యటన

మండలంలోని భోగాపురం పంచాయతీ అప్పన్నపేట గ్రామంలో జనసేన నాయకులు ఆదివారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను వారికి వివరించారు. లోకం మాధవిని గెలిపించేందుకు మీరంతా సహకరించాలని వారికి విన్నవించారు. గ్రామంలోని ఒక ఇంటి వద్ద కుళాయి కాలువలో ఉండడంతో తాగునీరు కలుషితం అవుతుందని గుర్తించారు. పంచాయతీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పళ్ళ రాంబాబు, పల్లంట్ల జగదీష్, సిరుగుడు వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులకు పనిముట్లు పంపిణీ

నెల్లిమర్ల: మండలంలోని జగ్గరాజుపేటలో ఆదివారం రాత్రి మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీకి ఓ అవకాశం ఇవ్వాలని ఆమె అభ్యర్థించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు మండలాల రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

వేపాడ: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ కిట్లు పంపిణీ చేపట్టారు. మండల నాయకులు సుంకరి అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు వి.సన్యాసినాయుడు పాల్గొని మాట్లాడారు. రాబోయే వంద రోజులలో టిడిపి జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజలకు వివరించి వైసిపిని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కొత్తవలస మండల అధ్యక్షులు గొరపల్లి రవి కుమార్, జామి మండల నాయకులు దేగల ఈశ్వరరావు, ఎల్.కోట మండల ఉపాధ్యక్షులు రాంబాబు, వేపాడ మండల నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, కోలా మధు, కన్నయ్యదొర తదితరులు పాల్గొని ప్రసంగించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరరావు

వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు జి. ఈరన్న తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్జుమర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవ రావు మాట్లాడుతూ వస్తువు కొనుగోలు చేసిన వినియోగదారులు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు. దీని ద్వారా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వలీఖాన్, ఆర్. శ్రీలక్ష్మి, అప్పలరాజు, డి. హైమవతి, సురేష్, ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌తోనే మెరుగైన పాలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మెరుగైన పాలన జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 296వ రోజు ఆదివారం పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేస్తూ, నాలుగేళ్ళలో అందించిన పథకాలు గురించి వివరించి మరోసారి తనను, జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, ఆవాల కృష్ణ, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, యలమంచిలి అప్పారావు, కొత్తూరు ఉల్లి శంకర్, తలారి అనంత్, మోపాడ కోటి, సీతంపేట అప్పలసత్యం, చింతల నారాయణమూర్తి, సరిపల్లి గణేష్, మాడెం వెంకటేష్, కోడూరు శ్రీను, సింహాచలం, సోషల్ మీడియా కో కన్వీనర్ మామిడి బుజ్జి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

ప్రవీణ్‌కుమార్(ఫైల్)

మండలంలోని నాతవలస 16వ జాతీయ రహదారి టోల్గేట్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని శనివారం యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాతవలస గ్రామానికి చెందిన గేదెల ప్రవీణ్ కుమార్ (29) తన మోటార్ సైకిల్ పై నాతవలస టోల్‌ప్లాజా నుంచి తిరిగి తన స్వగ్రామానికి వస్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య గంగోత్రితో పాటు సంవత్సరం ఆరు నెలల బాబు ఉన్నాడు. మృతుడు నాతవలస టోల్ గేట్‌లో పనిచేస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు జూదగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యు మహేష్ తెలిపారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారం ఆదారంగా దాడులు చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న అన్న కేంటీన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పేదలి ఆకలిని తీర్చడమే లక్ష్యంతో మండల కేంద్రంలో తహాశీల్దార్ కార్యాలయం వద్ద అన్న కేంటీన్ నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. 144వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా ఆదివారం మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీశెట్టి అరుణ, పట్టణ టిడిపి అధ్యక్షులు కొనేదం మల్లేశ్వరరావు, చక్కా కిరణ్ కుమార్, కాపుగంటి శ్రీనివాసు, గనివాడ బంగారు నాయుడు, భీసెట్టి మోహన్ కుమార్, ఎస్.టి.ఆర్, రొంగలి రమణ, హైటెక్ సురేష్, మునగపాక అప్పారావు, పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



ప్రసాద్ (ఫైల్)

మండలంలోని బొప్పడాం ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న కుసుమంచి ప్రసాద్(61) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. మృతుడు ప్రసాద్ మాస్టర్‌కి తల్లి, సోదరి, భార్య పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎంఇఒలు యు. సూర్య నారాయణ మూర్తి, ఈ. విజయ్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు, ఎమ్మార్సి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ విజయనగరం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు స్పెషల్ మొబైల్ కోర్టులో
O.S. 374/2022 IA No: 380/2022

Between:
కంది అన్నపూర్ణ ....పిటిషినర్
And :
ఆలవిల్లి సురేష్ ......రెస్పాండెంట్
To,
ఆలవిల్లి సురేష్ S/o లేటు అప్పలరాజు, H.No.14, LIG-II, ఆలకానంద కోలనీ, మున్సిపల్ పార్క్ దగ్గర, కంటోన్‌మెంట్, విజయనగరం, పిన్ 535003

పై నెంబరు గల షెడ్యూల్ దాఖలా ఆస్థిని ప్రథమ జప్తు చేయు నిమిత్తము మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను అవి అన్నియు అందుకోకుండా తప్పించుకోవడం వలన కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పత్రికా ప్రకటన మూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పిటిషనర్/వాది పై నెంబరు పిటిషన్‌ను మీపై దాఖలు చేసినందున సదరు పిటిషనర్ **2024 సం॥ జనవరి నెల 03వ తారీకున ఉదయం 10 గంటల 30 నిమిషములు**కు మీరు పై కోర్టువారి ఎదుట స్వయముగా కాని మీ యొక్క అడ్వకేట్ ద్వారా కానీ హాజరై వ్రాతపూర్వకమైన ప్రత్యుత్తరములు తెలియజేయగలరు. ఒకవేళ పై చెప్పబడిన దినమున మీరు హాజరు కానియెడల మీ పరోక్షమందు ఆవాజ్యమును విమర్శచేసి తీర్మాణించుటమగునని మీరు తెలుసుకోగలరు.

పి.హరగోపాల్
అడ్వకేట్,
విజయనగరం

మహారాజశ్రీ విజయనగరం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు స్పెషల్ మొబైల్ కోర్టులో
O.S. 374/2022

Between:
కంది అన్నపూర్ణ ....వాది
And :
ఆలవిల్లి సురేష్ ....ప్రతివాది
To,
ఆలవిల్లి సురేష్ S/o లేటు అప్పలరాజు, H.No.14, LIG-II, ఆలకానంద కోలనీ, మున్సిపల్ పార్క్ దగ్గర, కంటోన్‌మెంట్, విజయనగరం, పిన్ 535003

పై నెంబరు గల దావాలో మీకు ఎన్నిసార్లు దావా యొక్క సమన్లు పంపినను అవి అన్నియు అందుకోకుండా తప్పించుకోవడం వలన కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పత్రికా ప్రకటన మూలంగా తెలియజేయడం ఏమనగా వాది పై నెంబరు దావాను మీపై దాఖలు చేసినందున సదరు దావా **2024 సం॥ జనవరి నెల 03వ తారీకున ఉదయం 10 గంటల 30 నిమిషములు**కు మీరు పై కోర్టువారి ఎదుట స్వయముగా కాని మీ యొక్క అడ్వకేట్ ద్వారా కానీ హాజరై వ్రాతపూర్వకమైన ప్రత్యుత్తరములు తెలియజేయగలరు. ఒకవేళ పై చెప్పబడిన దినమున మీరు హాజరు కానియెడల మీ పరోక్షమందు ఆవాజ్యమును విమర్శచేసి తీర్మాణించుటమగునని మీరు తెలుసుకోగలరు.

పి.హరగోపాల్
అడ్వకేట్,
విజయనగరం